


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

మంగళవారం 15-7-2025

సంపుటి: 21 సంచిక: 96
పేజీలు: 8 వెల: రూ.1



# వైదిక గ్రామంపై విద్వేషాల పెత్తనం!




- శ్రీకూర్మంలో ఐదు దశాబ్దాల క్రితమే కళింగ సత్రం నిర్మించి వైష్ణవ సంప్రదాయం ప్రకారం వివాహాలు, ఇతర వైదిక కర్మలు, పితృకర్మలు చేయిస్తున్న చరిత్ర ఆ గ్రామస్తులది.
- రంగనాథస్వామి ఆలయం నిర్మాణం.. ఆ తర్వాత నుంచి అక్కడ పుట్టిన చాలామందికి రంగనాథం, రంగమ్మ అన్న పేర్లు పెట్టే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన గ్రామం అది.
- వైష్ణవాలయాలకు వెళ్లే సమయంలోనే తిరునామాలు పెట్టుకునే సంప్రదాయం నిత్యం స్త్రీ, పురుష భేదం లేకుండా వర్థిల్లుతున్న వైదిక ప్రాంతమది.
- నగరంలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం నారాయణ తిరుమలను నిర్మించిన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి గురుగుబిల్లి యతిరాజులుది ఈ గ్రామమే.
- నిరంతరం కాయగూరలు పండించి నగరానికి సరఫరా చేయడంతోపాటు ఒకప్పుడు దొండ సాగులో ఉత్తరాంధ్రకే టాప్‌గా నిలిచిన గ్రామం అది.
- ఎన్నో విశిష్టతలు.. ఎన్నెన్నో సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందిన ఆ ఊరే ఫరీదుపేట. కానీ ఒకే ఒక్క చెడ్డపేరు.. ఈ విశిష్టతలన్నింటీ ఊడ్చిపారేసి ఫరీదుపేట అంటే భయపడే పరిస్థితికి తీసుకొచ్చింది. అసలు ఎందుకీ దుస్థితి దాపురించింది? ఎవరు దీనికి కారకులు?? అన్న కోణంలో జరిపిన విశ్లేషణే ఈ కథనం.

- సంప్రదాయాలకు చిరునామాగా ఫరీదుపేట
- కూరగాయల సాగులో ఉత్తరాంధ్రలోనే పేరు
- విద్యావంతులు, ఉద్యోగులకు లోటు లేదు
- విషబీజాలు నాటిన కొన్ని కుటుంబాల ఆధిపత్య ధోరణి
- వాటికి ఆజ్యం పోసిన రాజకీయ విభేదాలు
- పేరుప్రతిష్టలను మసకబార్చిన హత్యలు, గొడవలు, కేసులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఓవైపు ఆధ్యాత్మిక ఔన్నత్యం.. మరోవైపు వ్యవసాయ రంగంలో పేరుప్రతిష్టలు సొంతం చేసుకున్న ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట పేరెత్తితే మాత్రం జిల్లా ప్రజలు భయపడుతున్నారు. ఈ గ్రామంలో పని చేయడానికి ఉద్యోగులు సైతం ఇష్టపడరు. అయ్య బాబోయ్ అక్కడికా అంటూ వెనుకంజ వేసే పరిస్థితి. దీనికి కారణం కొన్ని కుటంబాల ఆధిపత్య ధోరణి. వాటికి రాజకీయాలు తోడు కావడంతో అగ్నిలో ఆజ్యం పోసి నట్లయ్యింది. దేవుడి కార్యం విషయంలో రెండు వంశాల మధ్య దశాబ్దాల క్రితం తలెత్తిన ఆధిపత్య పోటీ క్రమంగా ముదిరి విభేదాలు, ఘర్షణల స్థాయికి చేరి.. హత్యలు, దాడుల వరకు వెళ్లిపోయింది. ఫలితంగా కొన్ని కుటుంబాలు మగదిక్కును కోల్పోతే.. కొందరు ఆస్తులు కోల్పోయి గ్రామంలో జీవనం గగనమై ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సి వచ్చింది. జిల్లాలోనే ఏకైక ఫ్యాక్షన్ గ్రామంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా రికార్డులకు ఎక్కడమే కాకుండా.. గుడి, బడిలాగే గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగడం కామన్ అయిపోయింది.

### ఉద్యోగం.. వ్యవసాయం..

జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న ఫరీదుపేట గ్రామంలో 1500 గడపలు, ఆరువేల జనాభా ఉంది. 70 శాతం ప్రజలకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. ముఖ్యంగా కూరగాయల సాగులు ఈ గ్రామం అగ్రగామి అని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు విద్యావంతులకు, ఉద్యోగులకు లోటు లేదు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన గురుగుబిల్లి యతిరాజులు ఈ గ్రామానికి చెందినవారే. ఉమ్మడి ఏపీలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా చేసిన బొడ్డేపల్లి సత్యనారాయణ కూగా ఈ గ్రామానికి చెందినవారే కాగా ఆయన కుమారుడు శ్రీనివాస్ ఐఆర్ఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నారు. ఇక పోలీసు, బ్యాంకు ఉన్నతో ద్యోగాలతో డాక్టర్లు, ప్రొఫెసర్లుగా చేస్తున్నవారు, రైల్వే, ఆర్మీ తదితర రంగాల్లో పని చేస్తున్న అనేకమంది ఈ గ్రామంలో ఉన్నారు. వీటన్నింటితోపాటు కావలసినంత నేరచరిత్ర కూడా ఈ గ్రామానికి ఉంది. 1951 నుంచి - మిగతా చివరి పేజీలో



### అటు పోర్టు, ఇటు ఎయిర్‌పోర్టుతో అనుసంధానం

ఉత్తరాంధ్ర మీదుగా ఇప్పటికే చెన్నై-కోలకతా జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 16) వెళుతోంది. దీన్ని అటు నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్టుకు, ఇటు మూలపేట సీ పోర్టుకు అనుసంధానం చేసేలా లింకు రోడ్లు ఇప్పటికే నిర్మిస్తున్నారు. దాంతో ఆ రెండింటికీ రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుంది. అదే సమయంలో మూలపేట వద్ద నిర్మిస్తున్న నౌకాశ్రయం(పోర్టు) నుంచి భీమిలి వరకు తీరం వెంబడి మరో జాతీయ రహదారి నిర్మిస్తే మూడు జిల్లాల్లోని తీరప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి. ఎయిర్‌పోర్టు, సీ పోర్టు మధ్య నేరుగా కనెక్టివిటీ కూడా ఏర్పడుతుంది. దానికితోడు ఇప్పటికే విశాఖ జిల్లాలో భీమిలి వరకు బీచ్ కారిడార్ పేరుతో తీరప్రాంత రహదారి నిర్మిస్తున్నారు. ఇప్పుడు భీమలి-మూలపేట మధ్య కోస్టల్ హైవే నిర్మిస్తే ఆ రెండూ అనుసంధానమవుతాయి. దీని నిర్మాణానికి రూ.8500 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. డీపీఆర్ తయారీ బాధ్యతను ఎస్.ఏ.ఇన్‌ఫ్రాకు అప్పగించినట్లు తెలిసింది. దీనివల్ల మూడు జిల్లాల తీరప్రాంతాల్లో ఆక్వా పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందుతాయి. టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయి. ఈ కోస్టల్ రహదారి వెంబడి ఎగుమతి, దిగుమతుల యూనిట్లు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. ముఖ్యంగా మూలపేట పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయ్యే పారిశ్రామిక క్లస్టర్‌కు ఈ రహదారి వల్ల చాలా ప్రయోజనం చేకూరుతుంది. రవాణా సౌకర్యాలు బాగా పెరగడం వల్ల పోర్టుకు అనుబంధంగా ఎగుమతి, దిగుమతుల కార్యకలాపాలు విస్తృతంగా ఏర్పాటవుతాయి. వీటివల్ల జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ఏళ్లతరబడి కొనసాగుతున్న వలసల సంస్కృతికి చరమగీతం పాడినట్లు అవుతుంది. జిల్లా ఆర్థిక పరిస్థితి కూడా మెరుగవుతుంది.

-
- కోస్టల్ హైవే మంజూరు చేసిన కేంద్రం
- మూలపేట-భీమిలి మధ్య 200 కి.మీ. నిర్మాణం
- సీ పోర్టుకు, ఎయిర్‌పోర్టుకు పెరగనున్న కనెక్టివిటీ
- ఆక్వా, టూరిజం రంగాల అభివృద్ధికి ఊతం
- ఆర్థికంగా ఎదగనున్న శ్రీకాకుళం జిల్లా

# మూలపేట... ప్రగతికి 'రాచబాట'

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా.. రాష్ట్రానికి ఈ చివరన ఉంటూ అభివృద్ధికి ఆమడదూరంలో మగ్గిపోతున్న శ్రీకాకుళం జిల్లా దశ తిరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఆలస్యమైనా పారిశ్రామికాభివృద్ధికి రాచబాట పడుతున్న శుభ సంకేతాలు వెలువడ్డాయి. తాజాగా రాష్ట్రానికి మరో జాతీయ రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం, దాన్ని శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట నుంచి విశాఖ జిల్లా భీమిలి వరకు ఆరు లైన్లుగా నిర్మించనుండటం జిల్లాకు నిజంగా శుభ సంకేతమే. ఇటు పర్యావరణ పరిరక్షణ, అటు తీరప్రాంత అభివృద్ధి, పర్యాటకాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి అనే బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవేను రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లా మీదుగా 16వ నెంబరు జాతీయ రహదారి వెళుతోంది. దానికి సమాంతరం తీరప్రాంతాలను అనుసంధానం చేస్తూ ఈ కొత్త జాతీయ రహదారిని 200 కిలోమీటర్ల నిడివిన నిర్మించనున్నారు. జిల్లాలోని సంతబొమ్మాళి మండలం మూలపేటలో ప్రస్తుతం పోర్టు నిర్మాణం జరుగుతోంది. దీన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అక్కడి నుంచి నేరుగా విశాఖ జిల్లా భీమిలి వరకు సాగర తీరం వెంబడి జాతీయ రహదారి నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత మార్చిలో కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందజేశారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం, విజయనగరం జిల్లా భోగాపురం, పూసపాటిరేగ మీదుగా భీమిలి వరకు దీన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. దీన్ని పరిశీలించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ పరిపాలన ఆమోదం మంజూరు చేసింది. దాంతో డీపీఆర్(డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసి కేంద్రానికి సమర్పించనున్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల ఉత్తరాంధ్ర మూడు ఉమ్మడి జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

### కేంద్రమంత్రి రాము చొరవ

కోస్టల్ హైవే మంజూరు విషయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా చొరవ తీసుకుని విశేష కృషి చేశారు. కేంద్ర కేబినెట్‌లో పౌర విమానయాన శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న ఆయన తన పరిధిలోనే ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి కానిచ్చేందుకు ఇప్పటికే తీవ్రంగా కృషి చేస్తున్నారు. దానికితోడు తన సొంత జిల్లా, సొంత పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో నిర్మిస్తున్న మూలపేట సీ పోర్టు నిర్మాణం విషయంలోనూ అదే చొరవ చూపిస్తున్నారు. ఈ రెండింటితోపాటు, తీరప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రతిపాదించిన కోస్టల్ హైవే మంజూరుకు కూడా ప్రత్యేక చొరవ తీసుకుని విజయం సాధించారు. ఇప్పుడు దీని సాకారం చేయాల్సిన బాధ్యత కూడా ఆయనపైనే ఉంటుంది.



• ఎడిటోరియల్

# విడాకులకు దారితీస్తున్న జీవనశైలి

ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్స్ సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ జంట తమ వైవాహిక బంధానికి బ్రేక్ చెప్పారు. చిన్ననాటి స్నేహితులు, బ్యాడ్మింటన్ క్రీడలో శిక్షణ పొందడం నుంచి పోటీల్లో పాల్గొనడం వరకు కలసిమెలసి మసలిన వీరు ఆ అనుబంధాన్ని వివాహం ద్వారా మరింతగా పటిష్టం చేసుకున్నారు. అయినా కొన్నేళ్లకే ఈ జంట విడిపోవాలని నిర్ణయించుకున్నారంటే వివాహ బంధం ఎంత బలహీనమైపోయిందో అర్థమవుతుంది. వీరే కాదు ప్రముఖ సంగీత దర్శకుడు, అస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ దంపతులు సుమారు మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి ముగింపు చెబుతున్నట్లు ఆమధ్య ప్రకటించారు. అలాగే ప్రముఖ క్రికెటర్ యజువేంద్ర చాహల్, ధనశ్రీ దంపతులు కూడా విడాకుల బాట పట్టారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉంది. ఈ ఉదంతాలన్నీ సనాతన ధర్మాన్ని, సంప్రదాయాన్ని పాటించే, దాన్ని గౌరవించే మన దేశంలో నానాటికీ విడాకుల కేసులు పెరిగిపోతున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు వివాహ వ్యవస్థపై అపరిమితమైన విశ్వాసం ఉండేది. కుటుంబంలో గానీ, భార్యాభర్తల మధ్య గానీ పొరపొచ్చాలు, విభేదాలు, గొడవలు తలెత్తినా తమలో తాము సర్దుకుపోయేవారు లేదంటే స్థానిక పెద్దల చొరవతో రాజీకి వచ్చేవారు. ఏకొద్దిమందో తప్ప కోర్టులకెక్కి విడాకుల వరకు వెళ్లేవారు కాదు. కానీ రాను రాను జీవనశైలితో పాటు మనుషుల నడవడిక మారిపోతోంది. సంప్రదాయలు, సనాతన వ్యవస్థల పట్ల పట్టింపు లేకుండా పోతోంది. దానితోడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయి చిన్న కుటుంబాలు ఏర్పడటం, భార్యాభర్తలు ఇరువురూ ఉద్యోగాలు చేస్తూ సంపాదనపరులుగా ఉండటం వల్ల కుటుంబ వ్యవస్థ కూడా దెబ్బతింటోంది. గతంలో భర్త బయటకెళ్లి ఉద్యోగమో, ఉపాధో పొంది సంపాదించి తెచ్చే బాధ్యత నిర్వర్తిస్తే.. భార్య ఇంటి మేనేజ్ చేస్తే నిలబెట్టే బాధ్యత చేపట్టేది. కానీ ఇప్పుడు మెజారిటీ కుటుంబాల్లో దంపతులిద్దరూ సంపాదిస్తుండటంతో కుటుంబ బాధ్యతల నిర్వహణ విషయంలో వారి మధ్య ఇగో సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలానా పని నేనే ఎందుకు చేయాలి? అన్న ధోరణి విభేదాలకు బీజం వేస్తోంది. అలాగే మానసిక దౌర్బల్యం కారణంగా ఇష్టమైన కూర వండలేదు.. ఇష్టమైన చీర కొనలేదు.. వంటి సిల్లీ కారణాలతోనూ చాలామంది విడాకులకు వెళ్లిపోతున్నారు. వీటికితోడు విడాకుల కేసుల విషయంలో సుప్రీంకోర్టు పలు నిర్ణయాలు తీసుకోవడంతో ఇవి త్వరత్వరగా పరిష్కారమై విడాకుల మంజూరు ప్రక్రియ వేగవంతమైంది. పూర్వం విడాకుల కేసు సెటిల్ కావడానికి సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు పెళ్లి అయిన నెలల వ్యవధిలోనే అభిప్రాయాలు కలవడం లేదంటూ జంటలు విడాకులకు వెళుతుండగా, కోర్టులు కూడా అంతే వేగంగా మంజూరు చేసేస్తున్నాయి. ఫలితంగా ఈ కేసులు బాగా పెరిగిపోయాయి. దేశంలో విడాకులపై ఓ సంస్థ సర్వే చేయగా సంచలన విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రాలవారీగా చూస్తే అత్యధిక విడాకుల రేటుతో మహారాష్ట్ర మొదటిస్థానంలో ఉంది. ముంబై, పుణె వంటి మహానగరాలు ఉండటంతో పాటు పెరుగుతున్న పట్టణీకరణ, ఆర్థిక స్వాతంత్ర్యం, మానసిక ఒత్తిళ్లు వంటి కారణాల వల్ల మహారాష్ట్ర 18.7 శాతం విడాకుల రేటుతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రం 11.7 శాతంతో రెండో స్థానంలో ఉంది. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కూడా విడాకుల రేటు అధికంగానే ఉన్నట్లు సర్వేలో తేలింది. చట్టపరమైన అవగాహన పెరగడం వల్ల ఈ రాష్ట్రంలో విడాకుల కేసులు రోజు రోజుకు పెరుగుతుండగా ప్రస్తుతం 8.8 శాతంతో మూడో స్థానంలో ఉంది. సంప్రదాయాలకు పెద్దపీట వేసే పశ్చిమ బెంగాల్‌లో కూడా విడాకుల రేటు క్రమంగా పెరుగుతుండటం గమనార్హం. ముఖ్యంగా కోల్‌కతా వంటి పట్టణ కేంద్రాల్లో విడాకుల రేటు 8.2 శాతం ఉన్నట్లు సమాచారం. అధిక పని ఒత్తిడి, వేగవంతమైన జీవితం, ఈ తరం జనాభాకు బంధాలపై పూర్తి అవగాహన లేకపోవడం తదితర కారణాలు విడాకుల కేసుల్లో పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. ఇక తమిళనాడులోని చెన్నై వంటి మహానగరాల్లో విడాకుల రేటు గణనీయంగా ఉన్నట్లు తేలింది. విద్య, ఆర్థిక స్వేచ్ఛ వల్ల ఈ రాష్ట్రంలో విడాకుల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని విశ్లేషించగా ఇక్కడ విడాకుల రేటు 7.1 శాతంగా ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో విడాకుల రేటు అనేది చాలా ఎక్కువగా ఉంది. ఇక్కడ కెరీర్, జీవనశైలి వంటి అంశాలు దీనికి కారణమవుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో విడాకుల రేటు 6.7శాతంగా ఉంది.

# నా జీవితం ప్రజాసేవకే అంకితం

## - ఇంటింటి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


నాజీవితం ప్రజాసేవకే అంకితమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం రూరల్ కుందువానిపేట గ్రామంలో ప్రతీ ఇంటికీ వెళ్లి, సమస్యలను తెలుసుకుంటూ, సత్వరమే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను నేరుగా తెలుసుకొనేందుకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, వినే సమస్య కన్నా, కళ్ళతో చూస్తే సమస్య పూర్తి వివరాలు, పరిష్కార మార్గాలు సుగమనం అవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం రూరల్ కుందువానిపేట గ్రామ పరిధిలోని వార్డులలో పార్టీశ్రేణులతో కలసి పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధి, విజయాలను వివరించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకువెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు మూకళ్ల శ్రీనివాస రావు, సూరాడ అప్పన్న గ్రామపెద్దలు, వార్డు ఇన్‌చార్జ్‌లు నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు. క్లస్టర్ ఇన్ చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# నా భూమిని అప్పగించండి

## జాయింట్ కలెక్టర్‌కు మొర పెట్టుకున్న వృద్ధుడు



(సత్యంన్యూస్, కొత్తూరు)



కొత్తూరు మండలం కలిగాం గ్రామంలోని సర్వే నెం 346/1 లోని 81 సెంట్ల తన భూమిని కొందరు కబ్జా చేశారని తనకు న్యాయం చేసి తన భూమిని అప్పగించాలని జిల్లా జెసీని గ్రీవెన్స్‌లో కలసి కలిగాం గ్రామానికి చెందిన అలిగాన జగన్మోహనరావు మొరపెట్టుకున్నారు. నగరంలోని జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జెసీని కలసి జగన్మోహనరావు విన్నించారు. తన స్థలానికి ఆనుకుని ఉన్న పోరంబోకు స్థలంతో పాటు తన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, ఇదే విషయాన్ని గతంలో అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. స్థలానికి సంబంధించి అన్ని దృవపత్రాలు ఉన్నప్పటికీ అధికారులు తనను కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారని, తన భూమిని ఆన్‌లైన్‌లో హోల్డ్ చేసి పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించి కేసును కోర్టులో వేశానన్నారు. ప్రస్తుత జెసీ కేసులను తొలగిస్తే న్యాయం చేస్తామని హామీనివ్వడంతో కేసులను తిరిగి తీసుకున్నానని చెప్పారు. కోర్టు తనను ప్రత్యేకంగా పరిగణించి ఆరువారాల్లో తన స్థలానికి తిరిగి తనకు ఇప్పించాలని తీర్పునిచ్చిందన్నారు. అయినా అధికారులు పట్టించుకోకుండా ఆరు నెలలుగా తనను తిప్పుతున్నారని జాయింట్ కలెక్టర్ హోల్డ్‌లో పెట్టిన తన స్థలంను రిలీజ్ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు తక్షణమే న్యాయం చేసి భూమిని తిరిగి అప్పగించాలని లేకపోతే తనకు చావు శరణ్యమన్నారు.

### రెండవ విడత ఐటీఐ

# కౌన్సిలింగ్ 23కి వాయిదా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళంలోని ప్రభుత్వ డీఎల్టీసి ఐ.టి.ఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 22 మధ్యాహ్నం 1 గంటలోపు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహనరావు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంకా 250మంది తమ ధ్రువపత్రాలు వెరిఫికేషన్ చేయించుకోలేదన్నారు. జులై 20 తేదీ లోపు అభ్యర్థులు తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. 22 జూలై మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ బలగలోని ప్రభుత్వ ఐటీఐ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే జూలై 23న జరిగే కౌన్సిలింగ్‌కి అనుమతించబడరన్నారు. మహిళలకు టైలరింగ్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. మరిన్ని వివరాలకు 9505161701, 9963945259, 9885960809 నెంబర్‌లను సంప్రదించాలన్నారు.

# పేదల కడుపు నింపటం కనీస బాధ్యత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నదానం మహాదానమని రెండవ పట్టణ ఎస్ఐ సంతోష్ మంగళవారం అన్నారు. స్థానిక గొంటివీధి నైట్‌షెల్టర్‌లో, నిస్సహాయులకు పెదపాడుకు చెందిన బొట్టా సాయికుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు పొడుగు చరణ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్ తదితర బృందం ప్రతినిత్యం ఇక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, సోమవారం రాత్రి అల్పాహారాన్ని తాను అందించటం ఆనందంగా ఉందన్నారు. అన్న సేవకు మించిన సేవ ఇంకేముంటుందని, పేదవారి కడుపు నింపటం గొప్పవిషయమన్నారు. పేదల కడుపునింపటం కనీస బాధ్యతని, ఉన్నదానిలో కొంతభాగం సేవలకు వినియోగించాలన్నారు. అనంతరం షెల్టర్‌లో ఉండే నిస్సహాయుల వివరాలను అడిగి, తెలుసుకుని, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే నూతనంగా షెల్టర్ బాధ్యతను నిర్వహిస్తున్న చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మికు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో జరిగే వేడుకలకు వేదికగా నైట్‌షెల్టర్‌ను తీసుకుంటే, వీరి ఆకలి తీర్చినవారమౌతామన్నారు.





చెకోవిస్కీ కన్సర్టోను అద్భుతంగా వాయించిన సంగీతజ్ఞుడిగా.. రష్యన్ ప్రజల మన్ననలందుకున్న ఆధునిక సంగీత గురు మనయంగత్ సుబ్రహ్మణ్యన్ విశ్వనాథ్. డాక్టర్ కావాలనుకుని యాక్టర్ అయ్యాననేవారిని తరచూ చూస్తుంటాం కదా.. అలాగే, ఎంఎస్వీ కూడా యాక్టర్ కమ్ సింగర్ కావాలని ఇండస్ట్రీకొచ్చాడు. జైలుడే రోజు ఖైదీలతో కలిసి సత్య హరిశ్చంద్ర నాటకంలో లోహితాస్యుడి వేషం వేసి అదరగొట్టాడు. అక్కడ ఖైదీలంతా సినిమాల్లో ప్రయత్నించు నీకు మంచి భవిష్యత్తుందని ప్రోత్సహించడంతో తన దృష్టి నటనపై పడింది. కానీ, విధి రాత విశ్వనాథన్ ను సంగీత దర్శకుడిగా మార్చేసింది. తరాలు మారినా మర్చిపోలేని పాటల పూదోటకు మారాజును చేసింది. జూలై 14 విశ్వనాథన్ లలిత సంగీతాన్ని వదిలి వెళ్లిన రోజు! ఒకసారి ఆ రూపానికి తగ్గ.. సంగీత దిగ్గజాన్ని సంస్మరించుకోవడం ఆయనకు మనమిచ్చే నివాళి!

# పియానోపై ఆ వేళ్ల మాఫియాకు ఫిదా అయిన రష్యన్స్!

అసలు బాలీవుడ్ కంటే కూడా అద్భుతమైన సంగీతాన్నందించిన ఘనత దక్షిణ భారత సినిమా చరిత్రది. వందేళ్ల దక్షిణ భారత సినిమా చరిత్రనోసారి పరిశీలిస్తే ఇక్కడి సంగీతానికి మిగిలిన సమాజంతో పోలిస్తే మరింత భిన్నంగా, రాగయుక్తంగా మల్చిన ఎందరో సంగీత దర్శకులు మనకు కనిపిస్తారు. అందులో ముందువరుసలో కూర్చునే సంగీత దిగ్గజం ఎంఎస్వీ. కడు పేదరికం నుంచి దక్షిణ భారత సినీ సంగీతంలో ఇవాళ్టికీ పేరు మోసిన ఇళయరాజా, రెహమాన్ వంటి ఎందరో మ్యూజిక్ డైరెక్టర్స్ తల్చుకునే ఓ రోల్ మాడల్ స్థాయికెదిగిన సరిగమల సారం ఎంఎస్వీ.

**విశ్వనాథన్ - రామ్మూర్తి జోడీగా మొదటి పరిచయం!**

12 ఏళ్ల వయస్సులోనే విశ్వనాథన్ జూపిటర్ ఫిల్మ్స్‌లో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించాడు. 1950 నుంచి 1860 మధ్య మనోహర, కర్పుక్కరసి, తంగపతుమై వంటి అతి పెద్ద తమిళ హిట్స్‌ను అధించిన ఓ ప్రధాన చిత్ర నిర్మాణ సంస్థ ఇది. జుపిటర్ ఫిల్మ్స్‌లో జస్ట్ ఆఫీస్‌బాయ్ ఎంఎస్వీ ఉద్యోగం. అక్కడే సీ.ఆర్.సుబ్బరామన్‌తో పరిచయమేర్పడి.. హార్మోనియం వాద్యకారుడిగా కుదిరాడు. అక్కడే వయోలిన్ విద్వాంసుడు టీ.కే.రామ్మూర్తితో స్నేహమేర్పడింది. ఆ తర్వాత వారిద్దరూ కలిసి తమిళ చిత్ర పరిశ్రమలో ఓ సంగీత జంటగా సినిమా సంగీతం చేయడం ప్రారంభించారు. అయితే, సుబ్బరామన్ తర్వాతే ఎంఎస్వీ, రామ్మూర్తి జంట సినిమా సంగీతాన్ని ప్రారంభించింది. 1952లో సుబ్బరామన్ మరణించిన తర్వాత ఆయన అసంపూర్తిగా వదిలేసిన దేవదాస్, అలాగే చండీరాణి వంటి సినిమాలకు విశ్వనాథన్-రామ్మూర్తి కలిసి సంగీతమందించారు. ఇక ఆ తర్వాత వారు వెనక్కి చూసుకున్న దాఖలాలే లేవు. అప్పటివరకూ దక్షిణ భారత సినీ సంగీతంలో జంట సంగీత దర్శకులెవ్వరూ లేరు. అలాంటి సమయంలో శంకర్-జైకిషన్ తరహాలో తామెందుకు పని చేయకూడదనే ప్రతిపాదనను రామ్మూర్తి ముందుంచింది ఎంఎస్వీనే. ముందు కొంత సంకోచించినా.. ఆ తర్వాత రామ్మూర్తి అంగీకరించడంతో ఇద్దరూ కలిసి అజేయంగా సినీ సంగీతాన్ని శాసించారు.

ఎంఎస్వీ బాణీలు కుదిరిస్తే.. వాటిని మరింత నైపుణ్యంగా మల్చడం రామ్మూర్తి చేసేవారు. స్వతహాగా వయోలినిస్ట్ కావడం వల్ల రామ్మూర్తి ఒక చిన్న అపశృతిని కూడా క్షమించేవారు కాదు. ఎంఎస్వీ ట్యూన్స్‌ను బీజీఎమ్స్‌తో సహా.. కండక్టర్‌గా ఒక సరైన పద్ధతిలోకి తీసుకువచ్చే క్రమంలో.. ఎక్కడైనా చిన్న తప్పు జరిగినా స్వరభేదం జరిగినా రామ్మూర్తి గుర్తించేవారు. అలా రామ్మూర్తి-ఎంఎస్వీ జంట 1952 నుంచి 65 వరకూ ఒక దశాబ్దకాలం దక్షిణాది సినీసంగీతంలో రారాజులుగా వెలుగు వెలిగారు. ఈ జంట తమిళంలో ఎంజీఆర్, శివాజీ గణేషన్, జయలలిత వంటి అగ్ర తమిళ నటులందరి సినిమాలకూ సంగీత దర్శకత్వం చేసింది.

దశాబ్దకాలం తర్వాత సోలోగానే సంగీతమందించాలనే పరస్పర నిర్ణయంతో ఎంఎస్వీ – రామ్మూర్తి జంట విడిపోయింది. అయితే, మళ్లీ యాదృచ్ఛికంగా ఈ ఇద్దరూ కలిసి 1995లో ఎంగిరుందో వంథన్ అనే సినిమా కోసం మళ్లీ కలిసి పనిచేశారు. ఎంఎస్వీ స్నేహితుడైన కన్నదాసన్ అనే ప్రముఖ గీత రచయిత కొంత విశ్వనాథన్ గురించి చెప్పుకొచ్చాడు.

ఓసారి మేము విమానమెక్కాం. విశ్వనాథన్ టాయిలెట్ అని రాసుంటే అది టూలెట్ అనుకుని రెంట్ ఎంత ఉంటుందనడిగాడు. మేం కాబూల్‌లో దిగాం. ఆ సమయంలో ఆఫ్ఘనిస్తాన్ అంటే ఏంటి.. మహ్మద్ ఘోరీ ఎవరని అడిగాడు. అక్కడినుంచి తాష్కెంట్‌కు వెళ్లాం. అలాగే సెయింట్ పీటర్స్‌బర్గ్ లోని లెనిన్ గ్రాడ్ కు వెళ్లాం. అతడికన్నీ మిస్ కమ్యూనికేట్ అవుతున్నాయనే విషయం మాకు అర్థమైంది. మమ్మల్ని ఆహ్వానించిన హోస్ట్ చెకోవిస్కీ కచేరీ హాల్‌కు తీసుకెళ్లాడు. రష్యన్ సంప్రదాయ సంగీత విద్వాంసులు వాయించే పియానోను చూపించాడు. చెకోవిస్కీ అనేది ఉచ్ఛరించడం కష్టమైన విశ్వనాథన్.. ఆ పియానో దగ్గరకు వెళ్లి వాయిస్తుంటే.. ఏకంగా 30 నిమిషాలపాటు హాల్ అంతా పిన్‌డ్రాప్ సైలెన్స్ నెలకొంది. విశ్వనాథన్ మేస్ట్రో కచేరీకి మంత్రముగ్ధులైన రష్యన్లు.. లేచి నిలబడి చప్పట్లు చరుస్తుంటే.. అతడికేం రాకుంటే ఏంటీ.. అన్నింటినీ మించినంత సంగీతం వచ్చుకదా అనిపించింది మాకు అంటాడు కన్నదాసన్.

దేవదాసులోని జగమే మాయ.. బతుకే మాయ వంటి బాణీతో ఓ తాగుబోతు విరహాన్ని సంగీతంలో వినిపించినా కన్నెపిల్లవని కన్నులున్నవని ఎన్నెన్ని ఒయలు పోతున్నావని ఓ ప్రియుడు ప్రేయసి గురించి ఆట పట్టించినా.. భలే భలే మగాడివోయ్ బంగారు మారాజువోయి అంటూ ఎల్లారి ఈశ్వరి గొంతుతో పురుషాధిక్య సమాజాన్ని గంతులేయించినా.. సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్ అంటూ ఆకలి రాజ్యపు కేకలు వినిపించినా.. ఏ తీగ పూవునో ఏ కొమ్మ తేటినో కలిపింది ఏ వింత అనుబంధమవునో అంటూ మరో చరిత్ర సృష్టించిన సంగీత దర్శకుడు విశ్వనాథన్. అందుకే ఆ స్వరద్రష్టకు నివాళులతో..

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..

### ఎంఎస్వీ ప్రారంభ జీవితం!

కేరళలోని పాలక్కాడ్ సమీపంలోని ఎలప్పుల్లిలో 1928, జూన్ 24వ తేదీన జన్మించిన ఎం. ఎస్. విశ్వనాథన్ బాల్యమేమంతా గొప్పగా సాగలేదు. 1932లో తన తండ్రి మరణించాడు. ఆ తర్వాత సోదరి మరణించింది. ఆ సమయంలో ఎంఎస్వీ తల్లి ఇక బతికి బట్ట కట్టే పరిస్థితి లేదనుకుని కొడుకుతో సహా బావిలో దూకి బలవన్మరణానికి సిద్ధపడింది. కానీ, అప్పుడే ఆ విషయం తెలుసుకున్న ఎంఎస్వీ తాత వారిని కాపాడాడు. అలా చావునోట్లో తలబెట్టి వచ్చిన విశ్వనాథన్.. ఆ తర్వాత దక్షిణ భారత సినీ పరిశ్రమంతా లేచి నిలబడి చప్పట్లు కొట్టే స్థాయికెదుగుతాడని ఎవరనకున్నారు? అదే మరి విధి అంటే! ఆ తర్వాత స్థానిక థియేటర్‌లో బఠాణీలమ్ముకుని బతికేవాడు ఎంఎస్వీ. కానీ, సంగీతమంటే మాత్రం చెవి కోసుకునేవాడు. తరచూ సినిమా పాటలు వింటూ గడిపేవాడు. ఓ సందర్భంలో హార్మోనియం వాయిస్తూ.. ప్రముఖ సంగీత విద్వాంసుడు నీలకంఠ భాగవతార్ దృష్టిలో పడ్డాడు. ఆ మెరుపును గమనించిన భాగవతార్ ఎంఎస్వీని చేరదీశాడు. సంగీతం నేర్పించాడు. మూడేళ్లపాటు నేర్చుకున్న సంగీత ఓనమాలకు మరింత సాధన చేసి ఇంపు తెచ్చాడు. అలా 13 ఏళ్లకే మూడు గంటలపాటు కచేరీ చేసి అందరి ప్రశంసలందుకున్నాడు. ఇక అప్పట్నుంచి ఆ రాయి రత్నమైంది. దక్షిణ భారత సంగీత రంగం మొత్తం చూపు తనవైపు చూసేలా మెరిసింది.

### నేర్చుకుంది భారతీయ శాస్త్రీయ సంగీతమే అయినా ప్రాశ్చాత్య సంగీతంలోనూ పట్టు!

బేసికల్‌గా కర్నాటక సంగీతంలో మాత్రమే శిక్షణ పొందిన ఎంఎస్వీ సంగీతం సమకూర్చిన సినిమాలోసారి పరిశీలిస్తే ఆయన 50 ఏళ్ల కెరీర్‌లో వందల సంప్రదాయేతర, ప్రాశ్చాత్య బాణీలు కనిపిస్తాయి. సామాన్యులు పాడుకునేదే పాట. జనరంజకమైందే పాట. ఈ సూత్రాన్నే నమ్మాడు ఎంఎస్వీ. అందుకే ఆయన పాటలన్నీ తేలికగా పాడుకునే ట్యూన్స్ ను మనమోసారి పరిశీలించొచ్చు. 1963లో రామ్మూర్తితో పాటు.. ఎంఎస్వీని మెల్లిసై మన్నార్ బిరుదుతోనూ.. అలాగే, ది కింగ్ ఆఫ్ లైట్ మ్యూజిక్ అనే సత్కారంతోనూ సన్మానించింది తమిళనాడు ప్రభుత్వం. ప్రాజెక్ట్ ఒప్పుకుంటే నిర్మాత, దర్శకులను తిప్పడం.. ఆలస్యం చేయడం వంటివేవీ ఎంఎస్వీ వద్ద కనిపించకపోయేవట. నిమిషాల్లో పాటలు కంపోజ్ చేయడం.. ఒక డేట్ అనుకుంటే ఒకటీ.. లేదా, రెండు రోజుల్లోపే ఆ పాటలను రికార్డ్ చేసివ్వడం.. ఇదీ ఎంఎస్వీ కంపోజింగ్ శైలి. దక్షిణభారత సంగీత చక్రవర్తి ఇళయారాజాకు సినిమా సంగీతంలో ఓ రోల్ మాడల్ విశ్వనాథన్. విశ్వనాథన్ కారు వస్తుంటే చూడ్డానికి తపన పడ్డ ఏకలవ్య శిష్యుడు. అలాగే, ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్. రెహమాన్ కూ ఎంఎస్వీ అంటే గురువు. ఈ మధ్యే చనిపోయిన భారతీరాజా కుమారుడు మనోజ్ తో ఆయన తండ్రి తీసిన సినిమా తాజ్ మహల్ కు ఏఆర్ఆర్ సంగీతమందిస్తే.. అందులోనూ, విశ్వనాథన్ ఓ ఊపైన పాట పాడి అలరించాడు.

# మనమెందుకు ఒంటరవుతున్నాం..?

- శుక్రవారం భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఒక విద్యాసంస్థ కార్యక్రమంలో మాట్లాడుతూ.. న్యూయార్క్ టైమ్స్‌తో సహా పశ్చిమదేశాల మీడియా ఎట్లా పక్షపాతంతో ఉందో చెప్పారు. పాకిస్థాన్‌కు భారత్ కలిగించిన నష్టాల ఫోటోలు ఎన్నో మీడియాలో వచ్చాయని, భారత్‌కు నష్టం కలిగిందని చెప్పేవారు ఒక్క ఫోటో కూడా చూపించలేకపోయారని ఆయన గుర్తుచేశారు. భారతదేశ జాతీయవాద నాయకత్వానికి, ప్రపంచ పెద్దలకు మధ్య ఉన్న ఒక పోటీని, వైరుధ్యాన్ని ఈ ఫిర్యాదులు సూచిస్తాయి. భారత-పాక్ వైరుధ్యాలలో ప్రపంచం భారత్ వైపు పెద్దగా లేదు అన్నది ఒక వాస్తవం. ఇండియా ఎంత వివాదాలకు దూరంగా ఉండాలనుకున్నా, దాన్ని ఎవరూ పూర్తి విశ్వాసంతో చూడడం లేదు. ఒక పెద్ద మార్కెట్‌గా తప్ప, ఒక గౌరవనీయ శక్తిగా పరిగణన మిగలడం లేదు. భారత్ ఆధిక్యాన్ని తగ్గించి చూపడమే కాకుండా, పాకిస్థాన్ సైన్యాధికారిని వైట్‌హౌస్‌కు పిలిచి మరీ విందు ఇచ్చిన ట్రంప్, ప్రపంచంలోని ఏ దేశాల మధ్య సంధి కుదరాలో, ఎవరు ఎవరి మీద గెలవాలో, ఎవరిది సరైన పక్షమో నిర్ణయించవలసింది తానేనని కుండబద్దలు కొట్టారు.
- భారతదేశం సరళి జాతీయవాద ఆదర్శాలకు అనుగుణంగా కాక, వివాదాలకు దూరంగా మెలిగే ఆత్మరక్షణ ధోరణిలో కనిపిస్తోంది. 1990ల నుంచి ఇలాగే ఉంది. ఇది తప్పుకాదు. ఉన్న పరిస్థితులలో మనుగడను కాపాడుకోవడం, దేశప్రయోజనాలను ప్రధానంగా తీసుకుని వివాదాలకు దూరంగా మెలగడం, ఆచరణాత్మక విధానంగా పరిగణిస్తారు. కానీ, ప్రపంచంలో భారత్ ప్రతిష్ఠను పెంచారని భావిస్తున్న నరేంద్రమోదీ హయాంలో కూడా ఈ 'ఆత్మరక్షణ' ధోరణి కొనసాగడం ఆశ్చర్యమే.



- అమెరికా, రష్యా రెండు ధ్రువాలుగా ప్రపంచాన్ని శాసించినప్పుడు, అంతకు ముందు రెండు ప్రపంచ యుద్ధాల్లో రెండు కూటమిలుగా దేశాలు విడిపోయినప్పుడు ఏదో ఒక పక్క ఒరిగిన భారతదేశం ఇప్పుడెందుకు ఆ స్ఫూర్తిని కొనసాగించలేకపోతుందంటే.. అందుకు చిన్న చిన్న తప్పిదాలే కారణం. మయన్మార్ లాంటి దేశం కోసం నిలబడటం వల్ల బంగ్లాదేశ్‌కు, కొత్తగా దలైలామా వారసుడు లామాను ప్రకటించడం ద్వారా చైనాకు శత్రువులు కావడం అనవసరం. ఇక పాకిస్తాన్ సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. చివరకు శ్రీలంక కూడా మన నుంచి దూరం జరిగిపోయింది.
- ఇజ్రాయిల్‌తో, అమెరికాతో ఎన్నో మొహమాటాలు ఉన్న దేశాలు కూడా ఇరాన్ మీద అమెరికా దాడిని ఖండించాయి. మనమెందుకు ఆ పని చేయలేకపోయాము?
- సంప్రదాయ మైత్రి అని చెప్పుకుంటూ, ఇరాన్ నుంచి చౌకగా చమురును సంపాదిస్తూ, ఆ దేశానికి కష్టం వచ్చినప్పుడు, మాటసాయం కూడా మనం చేయలేకపోయాం. అటు ఉక్రెయిన్ విషయంలోనూ, గాజా ఊచకోతలనూ వద్దనలేదు.

భారతదేశానికి తన ఇరుగుపొరుగుతో, ముఖ్యంగా పాకిస్తాన్‌తో, చైనాతో సమస్యలున్నాయి. ఆ రెండు దేశాలతో వ్యవహరించే తీరులో కూడా తేడాలున్నాయి. పెహల్గామ్ ఘాతుకం తర్వాత, భారత్ పాకిస్థాన్ మీద కఠినమైన ప్రతీకార చర్యలు తీసుకుంది. భారత్–పాక్ ద్వంద్వంలో ఉభయదేశాల ప్రజల మనోభావాలు చారిత్రకంగా పరస్పర శత్రుపూరితంగా రూపుదిద్దుకున్నాయి. 'ఆపరేషన్ సింధూర్" సందర్భంగా భారతదేశంలో వ్యక్తమైన భావావేశాలు, ప్రభుత్వ స్పందనల మీద వెల్లువెత్తిన ప్రశంసలు, సైన్యశక్తి మీద పెరిగిన వీరారాధనలు– జాతీయవాద దేశభక్తి తీవ్రతను సూచిస్తాయి. కానీ, అంతర్జాతీయ సమాజం, మీడియా భారత ప్రభుత్వ జాతీయావేశాల మీద చన్నీళ్లు చల్లింది. పాకిస్థాన్‌కు భారతదేశం కలిగించిన నష్టాన్ని అవి ధ్రువీకరించలేదు, పైగా, భారతదేశం అంగీకరించని నష్టాలను పదే పదే చెబుతూ వచ్చాయి. పాకిస్థానే కాళ్లబేరానికి వస్తే, తాము కాల్పుల విరమణ చేశామని భారత్ చెబుతుండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన జోక్యం వల్లనే యుద్ధం ఆగిందని పదే పదే చెప్పసాగారు. భారతదేశం ఎన్నిసార్లు ఖండించినా సరే, ట్రంప్ మాత్రం తగ్గలేదు. శుక్రవారం నాడు భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఒక విద్యాసంస్థ కార్యక్రమంలో మాట్లాడుతూ, న్యూయార్క్ టైమ్స్‌తో సహా పశ్చిమదేశాల మీడియా ఎలా పక్షపాతంతో ఉందో చెప్పారు.

**మనతో వాణిజ్య అవసరాలు, సహకార అవసరాలు ఉన్న చిన్నదేశాలు, ఘనస్వాగతాలు ఇస్తాయి, పౌర పురస్కారాలు అందిస్తాయి. అక్కడ మనకు కాంట్రాక్టులు లభిస్తాయి. అక్కడున్న వలసభారతీయులకు మనం ఓసిఐ కార్డులు ఇస్తాము. బాగానే ఉంటుంది. కానీ, 'ఆపరేషన్ సింధూర్' సమయంలో భారత్‌తో కచ్చితంగా నిలబడిన ఒక్క దేశం కూడా లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? మన దేశంతో వాణిజ్య అవసరాలున్న టర్కీ అవసరమైనప్పుడు పాకిస్థాన్‌తో నిలబడింది. అట్లా భారత్‌తో ఎవరు నిలబడ్డారు? చాటుగా, నర్మగర్భంగా సమర్థనలు ఇవ్వడం వేరు. పాకిస్థాన్‌కే తన ఓటు అన్నట్టు అమెరికా బాహాటంగా ఎందుకు వ్యవహరించింది? అసలు దక్షిణాసియాలో ఏ ఒక్క దేశంతోనూ భారతదేశానికి మంచి పొరుగు సంబంధాలు ఎందుకు సాధ్యం కావడం లేదు? ఒక ఆత్మవిశ్వాసంతో, రాజకీయ నిబద్ధతతో కూడిన విదేశాంగ విధానం లేకపోవడమే ఇందుకు కారణం కాదా? అన్నిటికీ దూరంగా ఉండడం అన్నది ఎవరికీ కానివారముగా మనల్ని మార్చివేయడం లేదా?**

అలీనోద్యమం కాలంలో, ప్రపంచంలో ఎక్కడ ఏ స్వాతంత్ర్య పోరాటం జరిగినా, జాతివిముక్తి ఉద్యమం జరిగినా, వివక్షలు కొనసాగుతున్నా, భారత్ వాటిని ఖండించడంలో ముందుండేది. అది కేవలం, సోవియట్‌యూనియన్ అండ చూసుకుని మాత్రమేనా? ఏకధ్రువ ప్రపంచం ఏర్పడుతున్న సూచనలు కనబడగానే, మనం మారిపోయామా? మొదటి గల్ఫ్ యుద్ధం సందర్భంగా, ఇరాక్ నుంచి, కువైట్ నుంచి భారతీయులందరినీ క్షేమంగా వెనక్కు తీసుకురావడానికి దౌత్యస్నేహాన్ని ఉపయోగించుకుని, ఆ వెనువెంటనే, అమెరికా విమానాలకు ఇంధనం నింపుకునే వెసులుబాటు కల్పించిన చరిత్ర ఆనాటి ప్రభుత్వాలది. సంప్రదాయ మైత్రి అని చెప్పుకుంటూ, ఇరాన్ నుంచి చౌకగా చమురును సంపాదిస్తూ, ఆ దేశానికి కష్టం వచ్చినప్పుడు, మాటసాయం కూడా మనం చేయలేకపోయాం. అటు ఉక్రెయిన్ విషయంలోనూ, గాజా ఊచకోతలనూ వద్దనలేదు. దేశం లోపల మహా శౌర్యంతో ఏకపాత్రాభినయాలు చేస్తూ, లోకపు కొలువుకూటంలో విదురనీతులూ, సన్నాయినొక్కులూ ప్రసాదిస్తే ఎలా? ఇజ్రాయిల్‌తో, అమెరికాతో ఎన్నో మొహమాటాలు ఉన్న దేశాలు కూడా ఇరాన్ మీద అమెరికా దాడిని ఖండించాయి. మనమెందుకు ఆ పని చేయలేకపోయాము? ఇది కేవలం ప్రస్తుత పాలనలోనే జరుగుతున్నది కాదు, మూడున్నర దశాబ్దాలుగా అన్ని పార్టీల హయాంలోనూ జరుగుతూ వస్తున్నదే.

**ప్రపంచంలో అనేక దేశాలు, తమ విశ్వాసాల మీద పట్టింపుతో ప్రమాదంతో కూడిన విధానాలను అనుసరిస్తున్నారు. వాళ్ల ప్రజలు కూడా ఆయా దేశాల ప్రభుత్వాల వెంట ఉన్నారు. నిజానికి, ఆ ప్రజలలో ఉన్న మనోభావాలు, సైద్ధాంతిక భావాలే పాలకుల తీరును శాసిస్తున్నాయి. మరి మన దేశ ప్రజలు ఇప్పుడు దేశభక్తితో ఉప్పొంగిపోతున్న స్థితిలో ఉన్నారు, ప్రపంచ దేశాలను సవాల్ చేయగలిగితే నాయకులను మరింత గాఢంగా ఆరాధిస్తారు. మరి నేతలు అట్లా ఎందుకు లేరు?**

ఈ పరిస్థితి భారతదేశ ప్రజల మీద ఎటువంటి ప్రభావం వేస్తుంది? విదేశాంగ విధానంలో సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండాలా లేదా అన్నది పెద్ద చర్చ. ఇజ్రాయిల్ మీద జాతిహనన ఆరోపణలతో అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లవలసిన అగత్యం దక్షిణాఫ్రికాకు ఏమిటి? బాహుబలి వంటి అమెరికా మీద ప్రతీకార దాడులు చేయగలిగే తెంపరితనం ఇరాన్‌కు ఏమిటి? అమెరికా మీద ఆధారపడకుండా, సొంత సైనికశక్తిని పెంచుకోవాలని మాట్లాడగలిగే ధైర్యం ఫ్రాన్స్‌కు ఎలా వచ్చింది? అమెరికా వెలివేతతో ఒంటరి దేశంగా అణగారిపోతున్నప్పటికీ క్యూబాకు పశ్చిమాసియా యుద్ధాలలో వైఖరులు తీసుకోవలసిన అవసరం ఏమిటి?

విదేశాంగ విధానంలో స్పష్టమైన స్టాండ్ కనబరిచే రోజులు పోయాయా? అమెరికా, రష్యా రెండు ధ్రువాలుగా ప్రపంచాన్ని శాసించినప్పుడు, అంతకు ముందు రెండు ప్రపంచ యుద్ధాల్లో రెండు కూటమిలుగా దేశాలు విడిపోయినప్పుడు ఏదో ఒక పక్క ఒరిగిన భారతదేశం ఇప్పుడెందుకు ఆ స్ఫూర్తిని కొనసాగించలేకపోతుందంటే.. అందుకు చిన్న చిన్న తప్పిదాలే కారణం. మయన్మార్ లాంటి దేశం కోసం నిలబడటం వల్ల బంగ్లాదేశ్‌కు, కొత్తగా దలైలామా వారసుడు లామాను ప్రకటించడం ద్వారా చైనాకు శత్రువులు కావడం అనవసరం. ఇక పాకిస్తాన్ సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. చివరకు శ్రీలంక కూడా మన నుంచి దూరం జరిగిపోయింది. చుట్టూ శత్రువులను పెట్టుకొని జియోపాలిటిక్స్‌లో వెనుకబడిపోవడం అంటే ఏమిటో తెలియాలంటే ఆపరేషన్ సింధూర్‌ను మూడు రోజుల్లోనే ముగించామని చెప్పడాన్నే ఉదాహరణగా తీసుకోవాలి.

- సత్యం ఐటీ డెస్క్

---

## అయ్యా, అంబానీ వారూ..
# కాస్త మమ్మల్ని దయచూడండి సారూ!

"అంబారీల ఊరేగింపులు.. సిగ్గుపడేలా భూమ్యాకాశాలు ఒకటి చేస్తూ జరిగిన ఆ అనంత వైభవోజ్వల వివాహం జరిగి ఏడాది అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా పత్రికల్లో వచ్చిన వార్తలాంటి ప్రకటన.. ప్రకటన లాంటి ఫోటో ఫీచర్ వార్త చదివితే.., చిత్రాలు చూస్తే కలిగే చిత్ర విచిత్ర అనుభూతులకు ఏ భాషలో అయినా మాటలు చాలవు..! పెళ్ళిళ్ళలో శాశ్వత సమాగమం, పునస్సమాగమం కార్యం లాంటి మాటలకు అర్థాలు తెలియక ఈ అతిలోక వివాహ తొలి ఏడు పండగ తెలుగు ప్రకటనల్లో వాడారో! తెలిసే వాడారో! తెలియదు. కానీ ఆ తెలుగులో నేరుగా ధ్వనించే అర్థాలను ఎవరైనా పూసగుచ్చినట్లు ఆ ఆది దంపతులకు వివరిస్తే ఎలా ఉంటుందో..!"




"మహాభారతంలో ఏది ఉందో అదే ప్రపంచంలో ఉంటుంది.. మహాభారతంలో ఏది లేదో అది ప్రపంచంలో ఎక్కడా ఉండదు' అని ఒక అద్భుతమైన శ్లోకం ఉంది. అలా ఈ తొలి ఏడు పెళ్లి పండుగ ప్రకటనల ప్రకారం 'ఈ పెళ్ళిలో ఏది ఉందో అదే ప్రపంచంలో ఉంటుంది.. ఈ పెళ్ళిలో ఏది లేదో అది ప్రపంచంలో ఎక్కడా ఉండదు!!' 'పృథివి కలవాడి పృష్ఠంబు పుండయిన జగతి వార్తకెక్కు' అని ఒక ప్రమాణం. అంటే బాగా డబ్బున్నవాడి పిర్ర మీద చిన్న పుండు లేచినా అది ప్రపంచానికి అతి పెద్ద వార్త అవుతుందట. పుండే అతి పెద్ద వార్త అయ్యేప్పుడు.. ఈ సహస్రాబ్దపు అతి పెద్ద పెళ్ళి పండుగ వార్త కాకుండాపోతే.. అది మానవ నాగరికతకే మాయని మచ్చ అయి ఉండేది!

అవును గానీ అంబానీ భయ్యా.. ఇది భారత దేశ వివాహ ఆచారాలను ప్రపంచ వేదిక మీద నిలబెట్టిన వేడుక ఎలా అవుతుంది? దేశంలో ప్రతి 100 కిలోమీటర్లకూ భాష, యాస వేర్వేరు అన్నట్టుగానే కులానికో రకం పెళ్లి తంతులాగే బోలెడన్ని వివాహ సంప్రదాయాలు, వేడుకలు.. అయినా ఇది సంపద ప్రదర్శన.. ఇది మహాట్టహాసం.. ఇది పటాటోపం.. ఇది మహాడంబరం.. ఇది భారతీయ వివాహ సంప్రదాయానికి మోడల్ కానేకాదు.. మీలాంటోళ్లు రోజుల తరబడీ వందల కోట్ల తంతు కానిచ్చేసి.. ఇదే మా పెళ్లి పద్ధతి అని చాటింపేస్తారు ఇలా పత్రికల్లో పెద్ద పెద్ద వాణిజ్య ప్రకటనలతో..! దయచేసి ఈ మోడలే భారతీయ వివాహ సంప్రదాయం పద్ధతి అని ముద్ర వేయకండి, మీకు పుణ్యం ఉంటుంది ప్లీజ్. మీ అంత గాకపోయినా మిగతా ధనికులు మిమ్మల్నే పాటిస్తారు. ఎగువ మధ్యతరగతీ ఆ వాతలు పెట్టుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. దిగువ మధ్యతరగతి ఆ వాతలకూ అప్పులు చేసి ఆరిపోతుంది. అప్పనంగా వచ్చిపడే ప్రజాధనం అందరి దగ్గరా ఉండదు కదా..! తెలుగు మధ్యతరగతిలో మేమూ తక్కువ కాదు.. పిచ్చి ప్రివెడ్ షూట్ల దగ్గర నుంచి.. హల్దీ, మెహందీ, మంగళస్నానం, బ్యాచ్‌లర్ పార్టీ, రికార్డింగ్ డాన్సుల సంగీత్, బరాత్, పెళ్లి, రిసెప్షన్, నోము.. ఎన్నెన్నో అట్టహాసాల వాతలు మేమూ పెట్టుకుంటున్నాం..!!

- ముచ్చట సౌజన్యంతో..

---

# మలివయసులో మరో జీవితం

**మీరెప్పుడైనా అహ్మదాబాద్ వెళ్ళారా?.. అక్కడి వీధుల్లో స్కూటర్‌పై దూసుకుపోయే బామ్మల జంటని చూశారా? 'స్నేహం అనే పదం ఒకప్పుడు చాలా పవిత్రంగా, బరువుగా ఉండేది.. స్నేహం చేస్తే మోసం చెయ్యకూడదు.. జీవితాంతం స్నేహబంధం కాపాడుకోవాలి..' ఇలా అనిపించేది. అయితే చదువు పూర్తి అయి ఉద్యోగంలో చేరినపుడు, అందుకోసం హాస్టల్లో చేరినపుడు ఎదురైన అనుభవాలు స్నేహం పట్ల దృక్పథం మార్చేశాయి. అడుగడుగున స్వార్థం, స్నేహం పేరిట వాడుకోవడం, నిండా ముంచెయ్యడం.. ఇలా ఎన్నో, పక్కవారి ప్రతిభను తొక్కేసి తాము ముందుకెళ్లాలనుకునే స్నేహితులు, దేవుడి పేరుచెప్పి దగ్గరై ఆనక గుడిని, గుళ్లో లింగాన్ని మింగాలనుకునే స్నేహితులు తక్కువ లేరు. అయితే మండుటెండలో మలయమారుతంలా పలకరించే స్నేహాలూ లేకపోలేదు. మనసున మనసై మన క్షేమాన్నే కోరుకునే అపురూపమైన స్నేహితులూ ఉంటారు. వారి స్నేహం మనకి సంజీవని. మహిళలకి పెళ్ళయితే స్నేహితుల గురించి మరచిపోతారని ఒక అభిప్రాయం సమాజంలో ఉంది. ఇప్పుడిప్పుడే ఇది మారుతోంది. స్నేహితులతో గడిపేవారు కనిపిస్తున్నారు.**







గుజరాత్‌కి చెందిన ఇద్దరు మహిళలు ఈ విషయంలో పాతికేళ్లుగా ఆదర్శంగా నిలుస్తున్నారు. మందాబెన్ షా, ఉషాబెన్ షా అనే స్నేహితురాళ్ళు స్కూటర్‌పై 'ఏ దోస్తీ హమ్ నహీ ఛో డెంగే' అని అహ్మదాబాద్ వీధుల్లో దూసుకుపోతూ ఉంటారు. వీరిలో మందాబెన్ ప్రస్తుత వయసు 86 ఏళ్ళు. 62 ఏళ్ళ వయసులో స్కూటర్ నడపడం నేర్చుకుంది. ఆమె ప్రియ స్నేహితురాలు ఉష మాత్రం ఎప్పుడూ పిలియన్ రైడరే. (పక్కన ఉండే తొట్టె లాంటిది). నిజానికి వీళ్ళిద్దరూ చాలారోజులు గుళ్ళకి, మార్కెట్లకు వెళ్ళడానికి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడేవారు. అయితే అలా బస్సుల కోసం వేచి చూడడం విసుగ్గా ఉండేది. దాంతో మందాబెన్ వేరే మార్గం ఆలోచించాలని అనుకుంది. ఉష వంతపాడింది. పడుతూ లేస్తూ మందా డ్రైవింగ్ నేర్చుకుంటే చప్పట్లు కొట్టి ఉష ప్రోత్సహించింది. కష్టమే కానీ అదే ఈ మిత్రుల ప్రత్యేకత.

'ఆ! కొన్నాళ్లే వీళ్ళ ముచ్చట' అనుకున్నవాళ్ళంతా విస్తుపోయేలా వయసు పెరిగే కొద్దీ ఈ బామ్మల ఉత్సాహం ఇంకా పెరుగుతోంది. రోడ్లన్నీ తమవే అన్నట్టు విహరిస్తూ ఉంటారు. పక్కనుంచి వెళ్లేవారు దృష్టి సారించకుండా, మెచ్చుకోకుండా ఉండలేరు. బస్సు కండక్టర్లు, క్యాబ్ డ్రైవర్లు, షాపులవాళ్ళు 'అమ్మా! సూపర్ డ్రైవింగ్' అంటూ ఉంటారు. కొందరు జాగ్రత్తలు చెప్తారు. అన్నిటికీ చిరునవ్వే సమాధానమిచ్చే మందాబెన్ స్కూటర్ తనకి కేవలం వాహనం కాదని, జీవించడానికి అవసరమైన శక్తి, స్వేచ్ఛ, ప్రేరణఇచ్చే ఆయుధమని చెప్తారు.

ఇప్పుడు ఈ స్నేహితుల ద్వయం అందరికీ తెలుసు. వారేదో ప్రచారం కోరుకున్నారని కాదు, జీవితాన్ని తమకు నచ్చిన విధంగా మలచుకున్నందుకు. వారు స్కూటర్‌పై చేసే ప్రతి ప్రయాణం వార్ధక్యం అంటే ఇతరులపై ఆధారపడటం కాదని అందరికీ గుర్తు చేస్తున్నట్లు ఉంటుంది. ఎప్పుడన్నా అహ్మదాబాద్ వీధుల్లో వారు మీకు తారసపడితే చూడండి అసలైన ఆనందం ఏమిటో. ఎనభైల్లో ఉన్న ఇద్దరు మహిళలు కలసి పయనిస్తూ గాలికి ఎగిరే ముంగురులను సరిచేసుకుంటూ జీవితానికి తమదైన భాష్యం చూపడాన్ని తప్పకుండా ఆస్వాదించండి.

- కె.శోభ

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## ఎరువులను సకాలంలో అందిస్తాం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

రైతులకు ఎరువులు ఎటువంటి ఇబ్బంది లేకుండా సకాలంలో అందజేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని నారాయణ పురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. కొర్లకోట గ్రామపంచాయతీలో యూరియా, డిఏపిలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరూ ఎరువును ఒకేసారి నిల్వ చేయకుండా విడతల వారీగా తీసుకొని వెళ్లి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

## మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో సిక్కోలు సత్తా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కడపలో ఈ నెల 13న జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం సత్తా చాటింది. జిల్లాకు చెందిన దిలీప్ 50 కేజీల విభాగంలో ఐదో స్థానం, వైకుంఠరావు 55 కేజీల విభాగంలో నాలుగో స్థానం, ఎన్.రాజు 90 కేజీల విభాగంలో రెండో స్థానం, కె.అవినాష్ ర్యాంప్ వాక్ ప్రథమ స్థానం, శివ మేన్స్ ఫిజిక్ రెండో స్థానం, దివాకర్ 60 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. జిల్లా బాడీబిల్డర్లు సత్తా చాటడం పట్ల స్టార్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్, ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, ది ఆంధ్ర బాడీ బిల్డింగ్ సెక్రటరీ ఆమదాలవలస శంకర్, ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



## వైదిక గ్రామంపై విద్వేషాల పెత్తనం!

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు 114 కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. హత్య, హత్యాయత్నం, దాడులు, దొమ్మీ తదితర కేసులు ఉన్నాయి. ఇవి కాకుండా స్టేషన్‌కు వెళ్లకుండా రాజీ చేసుకున్న కేసులకు లెక్కలేదు.

**ఏడున్నర దశాబ్దాల క్రితం..**

ఫరీదుపేట చరిత్రను పరిశీలిస్తే 1951లో తొలిసారి ఈ గ్రామం పోలీసు రికార్డులకు ఎక్కింది. నరసయ్య అనే వృద్ధుడు తొలిసారి హత్యకు గురయ్యాడని, గ్రామంలో హత్య జరగడం అదే మొదటిసారి అని స్థానికులు చెబుతున్నారు. దీనికి ప్రతిగా ఒక వృద్ధురాలిని ప్రత్యర్థులు హత్య చేశారనే ప్రచారం ఉంది. అప్పటినుంచి దాడులు , హత్యలు, రాజీలు నిత్యకృత్యంగా మారాయి. గ్రామంలో పైడి, కొత్తకోట కుటుంబాల మధ్య మొదటి నుంచి ఆధిపత్యం పోటీ ఉన్నా అంతకుముందెప్పుడూ అవి తీవ్రం కాలేదు. కానీ 1948లో గౌరీ పౌర్ణమి ఉత్సవాల సందర్భంగా ఆ రెండు వంశాల మధ్య తొలిసారి విభేదాలకు బీజం పడినట్లు స్థానిక పెద్దలు చెబుతున్నారు. పైడి కుటుంబాలు నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు ధీటుగా తాము కూడా నిర్వహించాలని కొత్తకోట కుటుంబాలు నిర్ణయించాయి. అప్పటి నుంచీ గ్రామంలో ఆ రెండు వంశాలు, వారికి మద్దతు ఇచ్చేవారు రెండు గ్రూపులుగా విడిపోయి గౌరీపౌర్ణమి ఉత్సవాలు జరపడం ప్రారంభించారు. ఆ నేపథ్యంలో జరిగిన ఒక వివాదమే 1951లో హత్యకు దారి తీసిందని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా 2021 ఉత్సవాల్లో ఈ రెండు గ్రూపులు కాకుండా మూడో గ్రూపు కూడా అవతరించింది. మొదలవలస, సత్తారు కుటుంబాలు వేరేగా ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించాయని గ్రామస్తుల ద్వారా తెలిసింది. 1990 తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలే దీనికి కారణమయ్యాయి.

కుటుంబాల వైరంలోకి రాజకీయాలు చొరబడటంతో పరిస్థితి మరింత దిగజారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి సాధించే క్రమంలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రతి చిన్న విషయాన్ని వివాదం చేయడం, పోలీసు స్టేషన్‌కు వెళ్లడం గ్రామంలో కొన్ని కుటుంబాలకు అలవాటుగా మారింది. ప్రత్యర్థులకు చెందిన వ్యవసాయ మోటార్లను బావుల్లో పడేయడం, పంటలు ధ్వంసం చేయడం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో వివాదంతో సంబంధం లేనివారిని నిందితులుగా చేర్చి ప్రతీకారం తీర్చుకున్న సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. చివరికి ఉద్యోగులు, విద్యార్థులను సైతం కేసుల్లో ఇరికించి వారి జీవితాలను నాశనం చేయడం పరిపాటైపోయింది. వారిని కేసుల నుంచి బయటపడేసేందుకు పోలీస్ స్టేషన్‌లో కూర్చొని సెటిల్మెంట్ చేసుకొనే సంప్రదాయం అప్పట్నుంచే ప్రారంభమైంది. అయితే రాజీ సెటిల్‌మెంట్ల సందర్భాల్లో వాటాల్లో తేడాలు రావడం, కొందరి మాట చెల్లుబాటు కాకపోవడం కూడా చాలా సందర్భాల్లో కొత్త ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. వీటి పర్యవసానంగానే 2001లో పోలినాయుడు హత్య జరిగిందంటున్నారు. దీనికి ప్రతీకారంగా వైరివర్గానికి చెందిన రాంబాబును హత్య చేశారు. ఆ తర్వాత రాజకీయ పార్టీల ముసుగు కప్పుకొని ఎవరికివారు పెత్తనం చేయడం ప్రారంభించారు. ప్రత్యర్థులను అడ్డు తప్పించాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే ఇరువర్గాలను లీడ్ చేస్తున్న ఇద్దరిపై హత్యాయత్నాలు జరిగాయి. గ్రామంలో కేవలం 25 మంది రాజకీయ ప్రత్యర్థులుగా మారి నడుపుతున్న ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల అనేకమంది గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇలా నాలుగైదు కుటుంబాల మధ్య ప్రారంభమైన విభేదాలను కక్షలుగా పెంచి పెద్దవి చేసి మొత్తం గ్రామంపై రుద్దేసి, గ్రామ చరిత్రను మసక బార్చేశారు. వాటి ఫలితంగానే ఇప్పుడు ఫరీదుపేట.. కక్షల కోట అన్న చెడ్డపేరును మూటగట్టుకుంది. గ్రామంలో పోలీస్ పికెట్‌ను దాదాపు శాశ్వతం చేసిసి.. పోలీసులతో సహజీవనం చేయాల్సిన పరిస్థితికి చేరుకుంది.

## గిరిజన సంక్షేమ ఆశ్రమ
## ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

☆ప్రధానోపాధ్యాయుని కొనియాడిన ఎస్టీ కమిషన్ చైర్మన్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఏడాది పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు, గత ఏడాది పదో తరగతి శతశాతం ఫలితాలు సాధించినందుకు ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు పనితీరును రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరావు కొనియాడారు. శాంతి నగర్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, సంక్షేమం గురించి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. వీరితోపాటు ఉపసంచాలకులు అన్నదొర, లైజన్ అధికారి మల్లికార్జున్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గిరిజన సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా తమ్మినేని రవి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా తమ్మినేని రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు కమిషనర్‌గా పని చేసిన పూజారి బాలాజీప్రసాద్ గత నెల 30న పదవీ విరమణ పొందడంతో కార్యాలయంలో ఏఈగా పని చేసిన జాన్సన్‌కు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. తాజాగా బాధ్యతలు చేపట్టిన తమ్మినేని రవి దేవదాయ శాఖ అధికారిగా పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ సక్రమంగా సాగేలా చర్యలు చేపడతానని కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవి అన్నారు. సిబ్బంది ఇప్పటి వరకు పని చేసిన మాదిరిగానే బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు.



## అశోక్‌గజపతిరాజును సత్కరించిన ఎన్ఈఆర్

(సత్యంన్యూస్, రణస్థలం)

గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని ఆయన బంగ్లాలో కూటమి నాయకులతో కలిసి సత్కరించారు. ఇటువంటి పదవి అశోక్ గజపతి రాజు వంటి రాజనీతిజ్ఞుడుకి దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. ప్రజా సేవలో అపార అనుభవం కలిగిన అశోక్ గజపతిరాజు నియామకంతో గోవా రాష్ట్ర పరిపాలన మరింత పటిష్టంగా సాగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, లుకలాపు అప్పలనాయుడు, పిన్నింటి మధుబాబు, పిసిని జగన్నాథం, లంక ప్రభాకరరావు, భూపతి అర్జున్, రౌతు శ్రీనివాసరావు, లంక అప్పలనాయుడు, వడ్డాది శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాసరావు, చిత్రి విజయ్‌కుమార్, పిసిని హరికృష్ణ తదితరులు ఉన్నారు.



## కాలువ పనులు ప్రారంభం

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండల కేంద్రంలోని శ్రీకాకుళం రోడ్‌లో గల గుంతలకు, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తహశీల్దార్ కె.బాలకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు ఆగతముడి మాధవరావు మంగళవారం కాలువ పనులను ప్రారంభించారు. గతంలో నివగాం రహదారి కూడా ఇదే విధంగా శాశ్వత పరిష్కారం చూపడంతో టీడీపీ నాయకులు, తహశీల్దార్ బాలకృష్ణపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాతల గాంధీ, ముగిటి కృష్ణ సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు చోడవరపు రాము తదితరులు పాల్గొన్నారు.



## ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహిస్తున్న లెక్చరర్ పోస్టుల రాతపరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు నోటిఫికేషన్ల ద్వారా వివిధ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ పరీక్షా కేంద్రంలో ఉదయం 8 గంటలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రారంభమైంది. పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించగా, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపున అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి, సెక్షన్ అధికారి ఎం.అమ్మాజీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలో ఏర్పాటు చేసిన సాంకేతిక సదుపాయాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, అభ్యర్థుల బయోమెట్రిక్ ధృవీకరణ వంటి అంశాలను పరిశీలించారు. మంగళవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 148మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా, అందులో 95మంది హాజరయ్యారు, 53మంది గైర్హాజరయ్యారు. అధికారులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి.



## 42 కేజీల గంజాయి స్వాధీనం

**- నలుగురు నిందుతులు అరెస్టు**
**- కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు**



(సత్యంన్యూస్, పలాస)

స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం నమోదు చేసిన రెండు కేసుల్లో 42 కేజీల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు వెల్లడించారు. మంగళవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందుతులను మీడియా ముందుకు తీసుకువచ్చి వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రం, వైశాలి జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు పాట్నాలో ఒక అపార్ట్‌మెంట్‌లో వంట పని చేసేవారన్నారు. వీరుతో పాటుగా అదే చోట పనిచేస్తున్న మరో మహిళతో కలిసి బగల్పూర్‌కు చెందినవారితో గంజాయి కొనుగోలు చేసి రవాణా చేశారన్నారు. రవాణా చేయడానికి రూ.5వేలు ఇస్తామని చెప్పడంతో రెండుసార్లు ఒడిశా నుంచి గంజాయిని తీసుకొని బగల్పూర్, పాట్నా వెళ్లినట్లు విచారణలో గుర్తించామన్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని కందమాల్ జిల్లాకు చెందినవారితో గంజాయి లావాదేవిలు చేసిన మరో ఇద్దరి సహాయంతో ఘనపూర్ రైల్వేస్టేషన్ వద్దకు ఐదు బ్యాగులలో 40కేజీల గంజాయిని తీసుకొని వచ్చారన్నారు. దీన్ని బీహార్ నుంచి ఒడిశా ఘనపూర్ రైల్వేస్టేషన్ వద్దకు వచ్చినవారికి అప్పగించారన్నారు. తిరిగి పలాస మీదుగా బగల్పూర్ వెళుతుండగా పలాస రైల్వేస్టేషన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారన్నారు. మరో నలుగురుని అదుపులోకి తీసుకోవల్సి ఉందన్నారు. మరో కేసులో హోటల్‌లో పనిచేస్తూ పరిచయమై ఒడిశా నుంచి గంజాయిని కేరళా తరలిస్తుండగా ఒడిశా, కేరళకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయిని కేరళలో అప్పగిస్తే కేజీకి రూ.10వేలు ఇస్తానని డీల్ కుదుర్చుకొని కేరళకు తరలిస్తుండగా పలాస రైల్వేస్టేషన్ వద్ద పట్టుబడ్డారన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. మంగళవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారత రాజ్యాంగనిర్మాత, అందులో గిరిజన హక్కులు గూర్చి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు కావలసిన అవసరాలను కమీషన్ తీరుస్తుందన్నారు. ఇంగ్లీషు పదాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. భోజనాలు ఎలా ఉన్నాయని ఆయన అడగగా బాగా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. దుప్పట్లు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందరూ బాగా చదువుకోవాలని, తాను బాగా చదువుకొని డాక్టర్, ఎంపీ అయ్యానని విద్యార్థులకు చెప్పారు. తరగతిలో ఏమైనా డౌట్స్ ఉంటే మాస్టారులకు అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులతో పద్యాలు అప్పజెప్పించి వాటి అర్థాలను తెలుసుకోవాలన్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని తెలిపారు. జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలు సందర్శించేందుకు జిల్లాకు వచ్చానన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి బాగోగులు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది పదవ తరగతి ఉత్తీర్ణత శతశాతం సాధించగా ఈ ఏడాది కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం 150 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని, 3 నుండి 10 వరకు ప్రభుత్వం అందిస్తున్న విద్యామిత్ర కిట్లు అందించడమైందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ విజయవాడ వారు ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు, పెన్లు, స్కెచ్ పెన్లు సరఫరా చేసినట్లు వివరించారు. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, స్వర్ణముఖి నదుల పేరుతో నాలుగు హౌస్‌లుగా విభజించి ప్రతీ శనివారం సామాజిక దృక్పథం ఉన్న అంశాలపై పోటీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఉండే ఎస్సీ, ఎస్టీ పోస్టుమెట్రిక్ హాస్టల్స్ రెండు, ప్రీ మెట్రిక్ రెండు హాస్టల్స్, బీసీ హాస్టల్స్‌కు విద్యార్థులు వెళ్లేందుకు 150మీటర్లు రహదారి, కాలువలు నిర్మించాలని కమీషన్‌ను ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు కోరారు. వర్షాకాలంలో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నట్లు కమీషన్‌కు వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నా దొర, ఎటిడబ్ల్యూఓ మల్లిఖార్జునరావు, పాఠక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరసవల్లి సూర్యనారాయణస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.



## గరిమెళ్ళ రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ప్రజాకవి స్వర్గీయ గరిమెళ్ళ సత్యనారాయణ రచనలు నేటితరానికి తెలిసేవిధంగా పాఠ్యాంశాలుగా చేర్చాలని గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు కోరారు. గరిమెళ్ళ సత్యనారాయణ 132వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాడాన రాజు మాట్లాడుతూ జాతి మరిచిపోయిన జాతిరత్నం గరిమెళ్ళ సత్యనారాయణ అని, ఆయన జయంతి వర్ధంతులు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆరవ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో గరిమెళ్ళ రచించిన మాకొద్దీ తెల్ల దొరతనం గేయం పాఠ్యాంశంగా చేర్చడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ గరిమెళ్ళ పేరిట గల చారిత్రిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ మాట్లాడుతూ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఇలపండగణపతిరావు పాడిన మాకొద్దీ తెల్ల దొరతనం అనే గేయం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతిస్వరూప్, మల్లిబాబు, అసిరి నాయుడు, గౌరీశంకర్, దుర్గారావు, రామారావు, మోహన్‌రావు, నరసింహమూర్తి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.